www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 ఫిబ్రవరి 2025
5
వైఎస్ఆర్



నేటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్ శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు వీలవుతుందని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్, సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మూడవ బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986 లలో సంప్రదించవచ్చని తెలిపారు.

'అన్నమయ్య' పునరుద్ధరణేదీ?

- జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు మోక్షమెప్పుడో
- పట్టాలెక్కని జాతీయ రహదారులు
- పరిహారం కోసం 'ముదివేడు' నిర్వాసితుల నిరీక్షణ
- నేడు సంబేపల్లెకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అన్నమయ్య జిల్లా పెండింగ్ సమస్యలకు నిలయంగా మారింది. సాగునీటి ప్రాజెక్టు పనుల దగ్గర నుంచి జాతీయ రహదారుల నిర్మాణాలు, నిర్వాసితులకు పరిహారం, వందలాది ఎకరాల భూకబ్జాలు, పారిశ్రామిక ప్రగతి తిరోగమనంతో కూడిన సమస్యలతో సతమత మవుతోంది. రాష్ట్రంలోనే మామిడి, అరటి తోటలకు, కరువు మండలాలకు నిలయమైన ప్రాం తాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చిన హామీ వెలవెలబోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె పర్యటన నేపథ్యంలో కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల ప్రచారంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా మారుస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ఉద్యాన పంటల సాగులో అగ్రపీఠిన నిలిచింది. జిల్లాలో నాలుగేళ్లుగా మామిడి తోటలు పూత పూయడం లేదు. ఫలితంగా మామిడి తోటలపై గొడ్డలి వేటు పడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి ఉద్యాన పంటల నిపుణుల సహకారం తీసుకుని అధిగమించడానికి కృషి చేయాల్సి ఉంది. ఉద్యాన పంటలకు నియలమైన ప్రాంతమైన రైల్వేకోడూరులో పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. రూ.ఐదు వేల కోట్లతో కూడిన కాలేటివాగు రిజర్వాయర్ నిలిచిపోయింది. రాయచోటి, చక్రాయపేట మండలాల్లో సుమారు 72 చెరువులకు జలకళ ప్రశ్నార్థకంగా మారింది. 2024 ఖరీఫ్ సీజన్లో కరువు కరాళ నృత్యం చేసింది. జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 22 మండలాల్లో కరువు మేఘాలు దట్టంగా కమ్ముకోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఉద్యాన యూనివర్శిటీకి మోక్షమేదీ?

రాజంపేట నియోజకవర్గ పరిధిలో 200 ఎకరాల్లో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటు హామీ అమలుకు నోచుకోవడం లేదు. 2014-2015 టిడిపి హయాంలో చేసిన ప్రయత్నం వెలవెలబోతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అప్సా జ్యూస్ పరిశ్రమ ఏర్పాటేదీ

రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగులో అన్నమయ్య జిల్లా అగ్రపీఠిన నిలుస్తోంది. మామిడి, అరటి తోటలు సహా ఇతర పంటల సాగుకు అవసరమైన నర్సరీలతో కళకళలాడుతోంది. ఉద్యాన పంటలకు నిలయమైన ప్రాంతంలో పండ్ల రసాల పరిశ్ర మలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకాలేదు.

పడకేసిన ప్రాజెక్టులు

జిల్లాలోని ప్రాజెక్టు పనుల పురో గతి ప్రశ్నార్థకంగా మారింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లు రద్దుకు గురైనప్పటి నుంచి ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-2లో భాగమైన జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ పనులు ఎప్పటికి సాకార మవుతాయో తెలియడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునురుద్ధరణ, ముదివేడు ఝరికోన రిజర్వాయర్ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులకు మోక్షమెప్పుడో తెలియడం లేదు.

పట్టాలెక్కని జాతీయ రహదారులు

రాయచోటి-చాగలమర్రి జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. ఐదేళ్లుగా కడప-తిరుపతి జాతీయ రహదారి పనులు సర్వే దశలో కునారిల్లుతున్నాయి. కడప-తిరుపతి గ్రీన్ఫీల్డ్ జాతీయ రహదారి సర్వే దశను దాటడం లేదు.

పరిహారం..పరిహాసం

అన్నమయ్య, బెంగళూరు-విజయవాడ ఎన్హెచ్ నిర్వాసితులకు వేదన తప్పడం లేదు. గ్రీవెన్స్సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పకీ పరిష్కారం కావడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ ఎప్పటికి సాకారమవుతుందో తెలియడం లేదు. రెండేళ్ల కిందట అన్నమయ్య గల్లంతైన ఘటనలో నష్టపోయిన వారికి మౌలిక వసతుల కల్పనలో తాత్సారం జరుగుతోంది. ఐదు సెంట్లలో పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ అమలులో నిర్లక్ష్యం నెలకొంది. రాయచోటి-వేంపల్లి-చాగలమర్రి, బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెతలు తప్పడం లేదు.



ఆశల పద్దు!

ఉక్కు పరిశ్రమకు ఊతమిచ్చేనా?
కడప-బెంగళూరు రైల్వే లైన్పై ఆశలు
'వెనుకబడిన' నిధులపై నిరీక్షణ
కొప్పర్తి ఆశలు నెరవేరేనా
నేడు కేంద్ర బడ్జెట్



కేంద్ర బడ్జెట్-2025-26 సమర్పణకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని విమాన, రైల్వే, ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపులపై అందరిదృష్టి నిలిచింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, పెండింగ్ రైల్వేలైన్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, కొప్పర్తి గ్రీన్ సిటీకి నిధులు, ఉపాధి హామీ పథకం నిధుల పెంపు, రైతుల ఆదాయం రెట్టింపు, మధ్యతరగతి నుంచి 4.6 కోట్ల మంది నుంచి 16 కోట్ల మంది దారిద్ర్యంలోకి జారుకున్న నేపథ్యంలో పేదల అభ్యున్నతి, నిత్యావసరాల ధరల తగ్గింపు వంటి సమస్యలు పేదలను చుట్టుముట్టడం తెలిసిందే. సామాన్యులకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత లభించనుందా లేదా అనే అంశంపై బుద్ధిజీవుల్లో ఆసక్తి నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్పై-2025-26 ఆసక్తి నెలకొంది. కేంద్రంలోని ఎన్డిఎ సర్కారు టిడిపి మద్దతుపై ఆధారపడిన నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, హక్కులను సాధించుకోవడంలో కూటమి పార్టీలైన టిడిపి, జనసేన ఏమేరకు సఫలీకృతమవుతాయో తేలిపోనుంది. 2014 రాష్ట్ర విభజనచట్టంలో పేర్కొన్న హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల పెండింగ్, కడప నుంచి విజయవాడకు రైల్వేలైన్, కడప-బెంగళూరు రైల్వేలైన్లకు కేటాయింపులు చేయాల్సి ఉంది. గత బడ్జెట్ల ఆర్థిక సర్వే, ఎటిఆర్ నివేదికల్లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే లేకపోవడంతో ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. తాజా బడ్జెట్లోనైనా సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, మైన్స్ కేటాయింపు, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు, కడప రైల్వేస్టేషన్ ఆధునీకీకరణ కేటాయింపులు చేయాల్సి ఉంది. కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు అలైన్మెంట్ మార్పును కోరుతూ గత వైసిపి సర్కారు లేఖ రాసిన నేపథ్యంలో నిలిచిపోయింది. విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని రైల్వేప్రాజెక్టులను రూ.73 వేల కోట్లతో చేపడతామని ఇటీవల మైదుకూరు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్న నేపథ్యంలో ఉత్కంఠను కలిగిస్తోంది.

కడప-బెంగళూరు, ప్రొద్దుటూరు-కంభం, భాకరాపేట -గిద్దలూరు, ఓబులవారిపల్లి-వాయల్పాడు పెండింగ్ ప్రాజెక్టులుగానే ఉన్నాయి. కడప-బెంగళూరు ప్రాజెక్టు రెండవ దశలో భాగంగా పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా చిత్తూరు జిల్లా వరకు చేపట్టాల్సిన పనులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఓబులవారిపల్లి-కృష్ణపట్నం రైల్వేలైన్ ప్రారంభించినప్పటికీ, సరుకు సరఫరాకు మాత్రమే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రొద్దుటూరు-కంభం, భాకరాపేట-గిద్దలూరు, ఓబులవారిపల్లి-వాయల్పాడు రైల్వేలైన్ ప్రతిపాదనల దశ దాటకపోవడం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. కడప-బెంగళూరు, కడప-విజయవాడ లైన్ కేటాయింపు ఆశలపైనే అందరి దృష్టి నిలిచింది. నందలూరు రైల్వే లోకోషెడ్కు ప్రత్యామ్నాయం, షిర్డీకి రైలు, తిరుపతి-మచిలీపట్నం రైలు కడప మీదుగా వెళ్లే అవకాశం కల్పించాలనే డిమాండ్లపై ఆసక్తి నెలకొంది. కడప-విజయవాడ, కడప-బెంగళూరు రైలు మార్గాలకు నిధుల కేటాయింపులు చేయాల్సి ఉంది. ఉపాధి హామీ పథకం నిధుల పెంపు, వేతన శ్లాబుల పెంపు, మహిళా సంక్షేమం వెరసి సామాన్యుల జీవన ప్రమాణాల, వ్యవసాయ కేటాయింపుల పెంపు వంటి సామాజిక పురోగమిత అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రిజిస్ట్రేషన్ ఛార్జీలకు రెక్కలు

గ్రామీణ ప్రాంతాలకు 40 శాతం పెంపు!
పట్టణాల్లో 18 నుంచి 22 శాతం వరకు
నేటి నుంచి అమల్లోకి ఛార్జీల పెంపు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరలకు రెక్కలొచ్చాయి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జనవరి ఒకటిన రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచాలని కసరత్తు చేసింది. క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతున్న తీవ్ర వ్యతిరేకతను గమనించి సుదీర్ఘ కసరత్తు చేసిన అనంతరం ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు చేస్తోంది. మూడు, నాలుగు రకాలుగా భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను వసూలు చేయనుంది. ఫిబ్రవరి ఒకటి నుంచి ధరలు పెరగనున్న నేపథ్యంలో జిల్లా ప్రజానీకం రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తిన వాతావరణం కనిపిస్తోంది. భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీల నేపథ్యంలో సబ్రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెద్దఎత్తున భూముల రిజిస్ట్రేషన్ లావాదేవీలు చేసుకోవడంలో నిమగ్నం కావడం గమనార్హం. రెండ్రోజులుగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆన్లైన్ సర్వర్ మొండికేయడం పరిపాటిగా మారింది. ఐదేళ్ల కిందట రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచని గ్రామీణ ప్రాంతాల భూములకు 40 శాతం మేరకు ఛార్జీలను పెంచనుంది. రెండేళ్ల కిందట రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచిన మండల ప్రాంతాల భూములకు 22 నుంచి 30 శాతం వరకు ఛార్జీలు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాలకు చెందిన భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను 18 శాతం చొప్పున పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని పెండ్లిమర్రి మండల పరిధిలోని భూములకు ఐదేళ్ల కిందట నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచిన దాఖలాల్లేవు. ఇక్కడి ఎకరా భూమి రూ.1.50 లక్షల వరకు పలుతుండగా ఇక్కడ 40 శాతం చొప్పున రూ.2 లక్షలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కడప నగర పరిసర ప్రాంతాల్లోని భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు 18 శాతం చొప్పున ధర పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తో ంది. ప్రభుత్వం సబ్రిజిస్ట్రార్ల వారీగా ఆదాయ లక్ష్యాలను నిర్దేశించింది. ఏడాదికి 55 శాతం నుంచి 65 శాతం వరకు లక్ష్యాలను చేరుకోవడం కష్టంగా మారింది. ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచడంతో నిర్దేశిత లక్ష్యాల్ని సునాయాసంగా అందుకునే అవకాశాలు ఉన్నాయని రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు పేర్కొనడం గమనార్హం.

'ఉక్కు' ఉద్యమానికి కలిసి రావాలి

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి
జీపుజాతాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



కడప అర్బన్: జీపుతాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు పేరుతో సాగుతున్న ఉక్కు ఉద్యమానికి అందరూ కలిసి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కడప ఉక్కు పరిశ్రమను సాధించుకోవడంలో వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు చేతగానివిగా మారాయని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తెలిపారు. సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరుగుతున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన కడప ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో శుక్రవారం రెండో రోజు కడప నుంచి ప్రారంభమైంది. ఒంటిమిట్ట, అల్లూరు, బద్వేలు మీదుగా నెల్లూరు జిల్లాలోకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి మోడీ, అమిత్షాలు ఫీజుబులిటీ పేరుతో మోకాలడ్డుతున్నారని విమర్శించారు. ఫీజుబులిటీ లేదనడం సరికాదని, రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడం వల్లే జాప్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు విశాల ఉద్యమం ద్వారానే సాధించారని, అటువంటి పోరాట పటిమను ప్రదర్శించాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. కరువు పీడిత, వెనుకబడిన ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాంతాల మధ్య సమతుల్యత సాధించొచ్చని రాజ్యాంగం చెబుతోందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు ఐఎన్ సుబ్బమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు చాన్బాషా, భైరవప్రసాద్, శ్రీనివాసులు, రాజామణి, రమణ, సురేష్, కుమారస్వామిరెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : వెనుకబడిన ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్ అన్నారు. ఒంటిమిట్టలో జీపుజాతా రాక సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఐఎన్.సుబ్బమ్మ, నర్సయ్య, రాము, ఖాదర్ బాషా, రమణ, సుబ్బయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

అట్లూరు : సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. అట్లూరుకు జీపుజాతా రాక సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ర్యాక్రమంలో నాయకులు రాజమణి, రవిచంద్ర, రమణ, నిత్య, గోపయ్య, లత, స్వప్న, విజయమ్మ పాల్గొన్నారు.

బద్వేలు : రాష్ట్ర సమగ్ర అభివృద్ధికై సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నంద్యాల, కడప జిల్లాల జీపు జాతా బృందాల సభ్యులు అన్వేష్, మనోహర్, చాంద్బాషా, భైరవ ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, ఐ.ఎన్.సుబ్బమ్మ, లక్ష్మీదేవి, నాగరాజు, నాయక్, నరసింహ, బాల వెంకట్, త్యాగరాజు బద్వేలు పట్టణానికి చేరుకోవడంతో సిద్ధవటం రోడ్డు లోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఫారెస్ట్ కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కడప జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, నంద్యాల జిల్లా నాయకులు నాగరాజు మాట్లాడుతూ సేయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని విభజన చట్టంలో పొందుపరిచినప్పటికీ నిర్మాణ పనులు పాలకులు మారినప్పుడల్లా శిలాఫలకాలు వేస్తున్నారే తప్ప నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగరాజు అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన జీపుజాతా శుక్రవారం రెండో రోజు కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి ప్రారంభమైంది. మైదుకూరు, బద్వేలు మీదుగా రాత్రికి నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి దేశలౌకిక రాజ్యాన్ని మతరాజ్యంగా మారుస్తోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరించివేస్తోందని విమర్శించారు. విభజన హామీలను తుంగలో తొక్కేసారన్నారు. ప్రజలపై భారాలు మోపడంలో టిడిపి, వైసిపి పోటీ పడుతున్నాయన్నారు.

చాపాడు (మైదుకూరు) : రాష్ట్ర ప్రభుత్వం ఆదానితో కుమ్మక్కై ప్రజల మీద రూ.16 వేల కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను మోపటం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ విమర్శించారు. నంద్యాల జీపుజాత మైదుకూరుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తుంటే నూతన ప్రభుత్వం ప్రజలపై కరెంటు చార్జీల భారం మోపుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగరాజు, నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, బాల వెంకట్, నాయక్, సిపిఎం మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్, మండల కమిటీ సభ్యులు గురయ్య, జహంగీర్ భాష, బీబీ, తామస్ పాల్గొన్నారు.



బద్వేల్లో జీపుజాతా సందర్భంగా బైక్ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్లో ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలను పులివెందులలో నిర్మించిందని పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కళాశాలను నడుపులేం, సదుపాయాలు కల్పించలేమంటూ ఎన్ఎంసికి లేఖ రాయడం దుర్మార్గమైన చర్య అన్నారు. పెండింగ్లో ఉన్న విద్యా, వసతి దీవెన వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, సొంత భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీ పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు కానీ, రాష్ట్ర విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కార్పొరేట్ వ్యవస్థకు తొత్తుల వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 8 నెలలు అవుతున్నా వారి పైన చర్యలు తీసుకోకపోవడం వెనకాల అంతర్యం ఏంటో చెప్పాలన్నారు. అనంతపురం నారాయణ కళాశాలలో అధిక ఫీజుల ఒత్తిడితో చరణ్ అనే విద్యార్థి మూడవ అంతస్తు నుంచి దూకి మరణించాడని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి, డిప్యూటీ సిఎం ఎలాంటి చర్యలు కానీ, కమిటీ కానీ వేయకపోవడం ఎంతవరకు సమంజసం అన ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యారంగ సమస్యను పరిష్కరించి చనిపోయిన విద్యార్థికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి చావుకు కారకులైన యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మహాసభల్లో విద్యారంగ సమస్యలు పరిరక్షించుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి, ఉపాధ్యక్షులు రాజశేఖర్, సహాయ కార్యదర్శి అజయ్, కమిటీ సభ్యులు అభినయ్, చారి, నగర అధ్యక్ష,కార్యదర్శులు సుమంత్, మోహన్ ఉపాధ్యక్షులు వంశి, వినోద్, నగర నాయకులు, ఉదయ్, శివ, రాజేష్, అసిఫ్, అంజిరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలియజేస్తున్నఎస్ఎఫ్ఐ నాయకులు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో వీధి బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ వీధి బాలల కోసం అంతర్జాతీయ దినోత్సవం జనవరి 31న నిర్వహిస్తారన్నారు. ఈ ప్రత్యేక దినం ఆస్ట్రియన్ స్వచ్ఛంద సంస్థ జుగెండ్ ఐన్ వెల్ట్ నుండి ఉనికిలోకి వచ్చింది అని తెలిపారు. ఈ సంస్థ 1997లో స్థాపించారని చెప్పారు. వీధి బాలల అభివృద్ధి, విద్యను ప్రోత్సహించడడే లక్ష్యం అని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. .కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరిండెంట్ పి.వీరయ్య, డిస్టిక్ ప్రొహిబిషనరీ ఆఫీసర్ సి.చెన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : జిల్లాలో పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని లా ఆఫీసర్స్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని బోర్డ్ రూమ్ హాల్లో పెండింగ్ కేసులపై లా ఆఫీసర్స్తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తహశీల్దార్ల స్థాయిలో పెండింగ్లో ఉన్న కేసుల వెంటనే సమీక్ష చేయాలని ఆర్డిఒలను ఆదేశించారు. కేసులకు సంబంధించి పూర్తి ప్రణాళికలు సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా లా ఆఫీసర్స్ తో సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ప్రతినెల చివరి శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో కడప ప్రభుత్వ ప్లీడర్ శివశంకర్రెడ్డి, ప్రొద్దుటూరు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ పవన్ కుమార్ రెడ్డి, బద్వేల్ అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ సూర్యానారాయణరెడ్డి, మైదుకూరు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ నరసింహ శర్మ, బద్వేల్ ఆర్డిఒ చంద్రమోహన్, పులివెందుల ఆర్డిఒ చిన్నయ్య, జమ్మలమడుగు ఆర్డిఒ సాయిశ్రీ, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న బాధితులు

యుసిఐఎల్ బాధితుల నిరసన

ప్రజాశక్తి - వేముల

యుసిఐఎల్ వ్యర్థాల వల్ల పూర్తి స్థాయిలో నష్టపోయామని, న్యాయం చేయాలని కణంపల్లి, కొట్టాల గ్రామాలకు చెందిన బాధితులు శుక్రవారం టెయిలింగ్ పాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మబ్బు చింతలపల్లి శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో టెయిలింగ్ పాండ్ నిర్మాణ సమయంలో అడుగు భాగాన బంకమట్టి వేయకుండా నిర్మాణం చేపట్టడం వల్ల యురేనియం వ్యర్థాలు భూమిలో ఇంకిపోయి తాగునీటి బోర్లు కలుషితమయ్యాయని వాపోయారు.ఫలితంగా పంటలు పండక, దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారని యుసిఐఎల్ సిఎండి సంతోష్ కుమార్ సత్పటికి విన్నవించారు. పైగా టెయిలింగ్ పాండ్ వల్ల వచ్చే దమ్ముధూళితో కొట్టాల గ్రామ ప్రజలు,రోగాల బారిన పడుతున్నారు. భూములిచ్చిన వారి కుటుంబంలో అర్హత కల్గిన వారికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పరిశ్రమ చుట్టుపక్కల వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని అధికారులకు తెలియజేశారు.

జ్ఞాన దీపాన్ని వెలిగించుకోవాలి



మాట్లాడుతున్న వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : మనిషి మెదడుకు పదివేల కోట్ల కంప్యూటరు శక్తి ఉంది, నిగూఢంగా ఉన్న శక్తిని తెలుసుకుని, మీరేం కావా లనుకుంటున్నారో నిర్ణయిం చుకుని జ్ఞాన దీపాన్ని వెలిగి ంచుకోవాలని హైదరాబాద్ వర్లూస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సక్సెస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సాఫ్ట్‌స్కేల్ ట్రైనర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణలు డాక్టర్ వర్లు అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో మానసిక వికాస ప్రేరణ కార్యక్రమం ఎపిజె అబ్దుల్ కలాం ప్రాంగణంలోని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానాన్ని ఉపయోగించుకున్నవారే గొప్పవారుగా నిలుస్తారన్నారు. సమాజం గుర్తించి, అభిమానించి గౌరవించాలంటే మన చేతుల్లోనే ఉందన్నారు. కాలయాపన లేకుండా కార్యోన్ముకులు కావాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రశ్నలేకపోతే ప్రగతి ఉండదన్నారు. చిన్న వయసులోనే ఒక బలమైన నిర్ణయం తీసుకుని అమలు చేసేందుకు ప్రయత్నించాలన్నారు. విద్య ద్వారానే గొప్పవారవుతామని సత్యానాదేళ్ల, అబ్దుల్ కలాం జీవిత విశేషాలను వివరించారు. సెల్‌ఫోన్‌లో ఉన్న ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్, యుట్యూబ్ వంటివి కాలాన్ని హరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తాపద్మ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి సమావేశంలో డీన్లు, ఆచార్యులు, సహ, సహాయ ఆచార్యులు, అధ్యాప కులు, విద్యార్థులు, స్కాలర్లు, హాజరయ్యారు.

'ఎడిఫై'యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యాశాఖ అధికారులను, విద్యార్థులను మోసం చేస్తూ అక్రమ అడ్మిషన్స్ నిర్వహిస్తున్న ఎడిఫై విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రేవల్యూషనరి స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యు) జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ డిమాడ్ చేశారు. గుర్తింపు లేకుండా అక్రమ అడ్మిషన్స్ నిర్వహిస్తున్న ఎడిఫై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలాని పట్టణంలో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరం, ప్రొద్దుటూరు పట్టణంలలో ఎడిఫై స్కూల్‌కు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా స్కూల్ యాజమాన్యం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్స్ ప్రారంభం అయ్యాయి అంటూ ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఎడిఫై స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు, కిరణ్, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

దుకాణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గోపవరం



మాట్లాడుతున్న డిపో మేనేజర్ నిరంజన్

బద్వేల్ ఆర్‌టిసి డిపో పరిధిలో దాదాపుగా 22 దుకాణాలు ఖాళీగా ఉన్నాయని, వ్యాపారులకు టెండర్ ద్వారా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ నిరంజన్ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారులు కోరిన దుకాణాలను ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బద్వేల్ డిపో పరిధిలోని వ్యాపార వాణిజ్య సముదాయాలకు త్వరలో కడప డిపిటిఒ కార్యాల యంలో నిర్వహించే టెంబర్‌లో బద్వేల్ పట్టణ ప్రజలు, వ్యాపారులు పాల్గొని అనుకూలమైన అద్దెలతో షాపులను దక్కించుకో వాలన్నారు. అలాగే ఎపిఎస్ ఆర్‌టిసి కార్గో పార్సెల్ సర్వీసును బద్వేల్ నియోజకవర్గం ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా ఎక్కడికైనా తక్కువ రుసుంతో వేగంగా సరుకులను రవాణా చేసేందుకు పార్సిల్ సర్వీసు అందుబాటులో ఉందని చెప్పారు. అవకాశాన్ని వ్యాపారులు, విద్యార్థులు, ప్రభు త్వ కార్యాలయాలు, పట్టణ ప్రజలు, విద్యా సంస్థలు, బ్యాంకులు, చిట్‌ఫండ్ కం పెనీలు అవకాశాన్ని వినియోగిం చుకోవాలని కోరారు. బల్క్ పార్శల్స్‌ను రాష్ట్రంలో ఎక్కడ నుండి ఎక్కడికైనా చేరవేయడానికి కార్గో కంటైనర్ కూడా ఉం దని, బియ్యం, దుస్తుల వ్యాపారులకు కంటైనర్‌ను బాడుగకు ఇస్తామని చెప్పారు.

అన్నవరంలో ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - చాపాడు



మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

మండలంలోని అన్నవరం గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 9 పశువులకు చూడి పరీక్షలు, 12పశువులకు గర్భకోశ వ్యాది చికిత్సలు, 37 దూడలకు నట్టల నివారణ టీకాలు, 89 పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు, 67 పశువులకు సాధారణ చికిత్సలు, 2 పశువులకు కృత్రిమ గర్భధారణ పరిక్షలు,5 78జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. 369 పశువులకు పిపిఆర్ వ్యాక్సిన్, 57 పశువులకు హెచ్ఎస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో చాపాడు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహమ్మద్ గౌస్, విఎల్ఒ వెంకటేశ్వర్లు, విఎఒ చలపతి, ఎహెచ్ఎలు మహబూబ్ హుస్సేన్, దస్తగిరి, విష్ణుప్రియ, అమర్ నాథ్ , సిబ్బంది రమాదేవి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

రైతులు ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ రమణ, యూనిట్ ఇన్‌ఛార్జులు శ్రీనివాసులు పేర్కొన్నారు . శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో మండలం పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అధిక శాతం రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల పెట్టుబడి వ్యయం పెరిగి నష్టపోతున్నారని తెలిపారు. కావున క్షేత్రస్థాయిలోని సిబ్బంది ప్రకృతి వ్యవసాయం రైతులు చేసే విధంగా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే చాలామంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వారికి ఏ సీజన్‌లో ఏ రకమైన కషాయాలు తయారు చేయాలో తెలియజేసి పిచికారి చేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జులు రామకృష్ణ, జయమ్మ, రిభికా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా

ప్రజాశక్తి - గోపవరం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరూ కలసి కట్టుగా చర్యలు తీసుకోవాలని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా పేర్కొన్నారు. గోపవరం ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి, ఎంపిడిఒ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యేని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికి సన్మానించారు. తర్వాత శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనుల గురించి వించారు. శాఖల వారీగా ప్రజా ఫిర్యాదుల గురుంచి ఆమె సమీక్షించారు. కొన్ని ముఖ్యమైన సూచనలు అధికారులకు చేశారు. రాబోవు వేసవి కాలంలో ఎక్కడా తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, రైతు సేవా కేంద్రంలో యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఉపాధి కార్డు దారుడుకి వంద రోజుల పని కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పలు జాగ్రత్తలు పాటించాలని, రెవెన్యూ సదస్సులో భాగంగా గ్రామాల వారీగా రెవెన్యూ శాఖకు ఎన్ని పిర్యాదులొచ్చాయి, ఎన్ని పరిష్కరించారని ఆమె ఆరా తీశారు. పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి శాఖ అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి, స్థానిక ఎంపిటిసి లక్ష్మీదేవి, హసీనా, వివిధ పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు, నాయకులు మల్లికార్జున రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, హరికృష్ణారెడ్డి, కుప్పాల శ్రీరాములు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - చాపాడు



మాట్లాడుతున్న సిఐ రమణారెడ్డి

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాదకద్రవ్యాల నిరోధక శాఖ సిఐ రమణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పల్లవోలు వద్ద గల సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తుపదార్థాలు, మారక ద్రవ్యాల వినియోగం,దుష్పరిమాణాల అంశంపై విద్యార్థులతో చర్చావేదిక, అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలు, మారక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు తమ జీవితాలను చేతులారా నాశనం చేసుకుంటారన్నారు. ఎన్నో కుటుంబాలు వీటి బారిన పడి ఇబ్బందులు పడినసంఘటనలు మన చుట్టూ నిత్యం జరుగుతున్నాయన్నారు. విద్యార్థి దశలో మంచి అలవాట్లకు ఆకర్షితులు కావాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల జాడలో నడవాలని వారు సూచించారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల వినియోగం అధికమైందని చాప కింద నీరులా వీటి వినియోగం విస్తరిస్తుందన్నారు. వీటి వాడకాన్ని ప్రతి ఒక్కరూఖండించాల్సిన అవసరం ఉందన్నారు. మత్తుపదార్థాల గురించి ఏదైనా సమాచారం ఉంటే 101కి డయల్ చేయాలని తమ దష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాదడంలో వైసిపి, టిడిపి దొందూ దొందే

ప్రజాశక్తి - వేంపల్లె : ప్రజలపై అదనపు పన్నులు వేసి, చార్జీలు పెంచి ప్రజలను బాదడంలో వైసిపి, టిడిపి కూటమి దొందూ దొందేనని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని అలాగే అదనపు పన్నులు వేయమని జగన్‌రెడ్డి, వైసిపి నాయకులు 2019 ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడంతో పాటు మడమ తిప్పిందని చెప్పారు. వైసిపి ఐదేళ్ల పాలనలో దాదాపు రూ.1.40 వేల కోట్ల అదనపు భారం ప్రజలపై మోపిందని చెప్పారు. పెట్రోల్, డీజిల్ కు చెందిన అదనపు వ్యాట్, రోడ్డు పన్ను, ఆర్‌టిసి, విద్యుత్ చార్జీలు, ఇసుక ధరలు, ఆస్తి పన్ను, మద్యం, చెత్త పన్ను మీ సేవా పన్నులు, వాహనాల పన్ను, రిజిస్ట్రేషన్ల పన్నులు పెంచి ప్రజలు కోలుకోలేని విధంగా చేయడం జరిగిందని చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే అదనపు పన్నుల భారం వేయం, చార్జీలు పెంచమని కావాలంటే ఇంకా తగ్గిస్తామని కూటమి నాయకులు 2024 ఎన్నికల్లో ప్రజలకు హామీలను గుప్పించారని, దీంతో ప్రజలు కూటమి నేతల మాటలను నమ్మి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో కూటమి నాయకులను గెలిపించారని చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బాదుడు కార్యక్రమం ప్రారంభించిందని చెప్పారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న , శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు అనుబంధ సంఘం మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణంలో మున్సిపల్ కార్మికులు చాలా ఏళ్ల నుంచి సొంత ఇల్లు లేక అద్దె ఇంటిలో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో మున్సిపల్ కార్మికులకు ఇంటి స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు అందరికీ ఒకే చోట ఇంటి స్థలాలు కేటాయించి కాలనీగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు అందరికీ కాలనీ ఏర్పడితే చాలా సంతోషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఫెడరేషన్ కోశాధికారి శివయ్య , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - సింహాద్రిపురం



మాట్లాడుతున్న మురళీమోహన్‌యాదవ్

రాష్ట్రంలో బిసిల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ప్రశంసనీయమని టిడిపి జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు లోమడ మురళీమోహన్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసిల అభ్యున్నతి కోసం రూ 896 కోట్లను విడుదల చేశారన్నారు. యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీల మేరకు బిసి కోసం నిధులను విడుదల చేయడం హర్షణీయం అని అన్నారు. గత వైసిపి ప్రభు త్వం హయంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ అవి అలం కారప్రాయంగా మాత్రమే మిగిలిందన్నారు. అప్పటి సిఎం వైఎస్ జగన్ నిధులు ఇవ్వకుండా లేకుండా కాలయాపన చేశారన్నారు. పులివెందుల నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి బిసిల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. బిసిల కోసం యూనిట్ 50 శాతం రాయితీతో నిధులు ఇస్తారని చెప్పారు. 21 సంవత్సరాల నుంచి 60 వరకు అర్హులని, దరఖాస్తులను ఫిబ్రవరి 7 లోపల ఎపి ఒబిఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. యూనిట్ అర్హతను బట్టి రూ. 2 లక్షలు, రూ. 3లక్షలు, రూ. 5 లక్షలు వరకు రుణాలు ఇస్తారని, బిసిలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ : రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పులివెందుల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి వెంకట ప్రసాద్ అన్నారు. 36వ జాతీయ రహదారి వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ను ధరించాలని, అలాగే లైసెన్స్ కూడా కచ్చితంగా ఉండాలని చెప్పారు. నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాల నడపరాదని, అతివేగం ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హాజీవలి, ఎంవిఐ కార్యాలయ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వసతి భవనం ప్రారంభం

ప్రజాశక్తి- ఒంటిమిట్ట

శ్రీ కోదండ రామస్వామి శాశ్వత వివాహ వేదిక సమీపంలో, జాతీయ రహదారి పక్కన నిర్మించిన గరుడ వసతి భవనాన్ని శుక్రవారం ఒంటిమిట్ట సిఐ బాబు శుక్రవారం ప్రారంభించారు. కోదండ రామస్వామి ఆలయం, కల్యాణ వేదిక సమీపంలోనే ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని సిఐ బాబు అన్నారు. నిర్వాహకులు హరి నారాయణ, సురేష్ మాట్లాడుతూ పది రూములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 24 గంటలు యాత్రికులకు, భక్తులకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. నిర్వహణలో ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పాటూరు గంగిరెడ్డి, మేకపాటి నంద కిషోర్ కుమార్ రెడ్డి, రుద్రరాజు భాన ుప్రకాష్ రాజు, షేక్ కరీముల్లా, జబీవుల్లా, షేక్ హాఫీజ్, సైఫుల్లా, గుండ్రాతి మహేశ్వరయ్య, ముస్తఫా,కత్తి చంద్ర, జాకీర్ హుస్సేన్, శివరాజు బాలరాజు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) :ఆర్థిక అక్షరాస్యత పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జి.వి సత్రం ఎపిజిబి బ్రాంచ్ మేనేజర్ ఎన్. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో రిజర్వ్ బ్యాంకు వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.హైస్కూల్ హెడ్మాస్టర్ ఎన్ .రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు ఇక్కడ తెలుసుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, తోటి మిత్రులకు తెలియజేయాలని సూచించారు .రిటైర్డ్ మేనేజర్ కృష్ణారెడ్డి సైబర్ క్రైమ్స్,బ్యాంకు లావాదేవీల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కె .ఎస్ .రూరల్ మీడియా కళాజాత బృందం కళా ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రోగ్రాం కో -ఆర్డినేటర్ ఉదయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు సత్వర న్యాయం అందించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు:



న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

పేదలకు సత్వర న్యాయం అందించాలని న్యాయమూర్తులు తెలిపారు. స్థానిక కోర్టులో 2వ అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తూ రమేష్ కుమార్ బదిలీ అయిన సందర్భంగా వీడ్కోలు సభ, ఇక్కడే సీనియర్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉంటూ ఇక్కడే 2వ అదనపు జిల్లా జడ్జిగా ఉద్యోగోన్నతి పొందిన సత్యకుమారికి ఆహ్వానసభ శుక్రవారం నిర్వహించారు. ప్రొద్దుటూరు బార్అ సోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ సత్వర న్యాయం అందించడం వల్ల చక్కటి సమాజాన్ని ఆవిష్కరించగలమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న రమేష్‌కుమార్‌కు అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. ఇక్కడే సీనియర్ సివిల్ జడ్జిగా ఉంటూ సత్యకుమారి ఇక్కడే 2వ అదనపు జిల్లా జడ్జి ఉద్యోన్నతి పొందడం కోర్టు చరిత్రలో మొదటి సారి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హారిక, 1వ మేజిస్ట్రేట్ సురేంద్ర రెడ్డి, బార్ కార్యదర్శి ఖాసిం, గుర్రప్ప, సీనియర్ న్యాయవాదులు మార్తల సుధాకర్‌రెడ్డి, దాదాపీర్, వెంకటరత్నం, దాదా హయాత్, లత,జె.కె.చారి, ఎపిపిలు రాంప్రసాద్‌రెడ్డి, ఓబులేసు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి గ్రస్తులపై వివక్ష చూపరాదు

ప్రజాశక్తి - వేంపల్లె :కుష్టు వ్యాధిగ్రస్తులపై ఎవరూ వివక్ష చూపరాదని వైద్యురాలు లక్ష్మి ప్రియ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అలిరెడ్డిపల్లె గ్రామంలో చర్మ వ్యాధులపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మ వ్యాధులపై ఫిబ్రవరి 13 వరకు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుష్టు వ్యాధి అనేది సాధారణమైన వ్యాధి అన్నారు. మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వ్యాపిస్తుందని చెప్పారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స చేయిస్తే అంగవైకల్యం నివారించవచ్చు అన్నారు. కుష్టు వ్యాధి నివారణకు 6 నెలల నుండి 12 నెలలు వరకు పడుతుందని చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ వున్నిసా బేగం మాట్లాడుతూ వ్యాధి గ్రస్తులకు కుటుంబంలో, సమాజంలో చోటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు బాలకృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, నీటి సంఘం సభ్యుడు పీరు సాహెబ్, సిహెచ్ఒ వెంకటరత్నం, మమత, సూపర్‌వైజర్లు, వెంకట లక్ష్మీ, అంకయ్య, ఎఎన్ఎం విజయ కుమారి, ఆశాలు పాల్గొన్నారు.

సమాజ సేవ కోసం ముందుకు రావాలి

ప్రజాశక్తి - వేంపల్లె



బాడీ ఫ్రిజర్‌ను ప్రారంభిస్తున్న చక్రపాణిరెడ్డి

నవాజ సేవ కోసం ప్రతి ఒక్కరూ ముం దుకు రావాలని మాన వతా సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన కొప్పరపు నరసింహులు జ్ఞాపకార్థం ఆయన మేనల్లుడు మేడా వెంకట వీర బ్రహ్మం, సతీమణి నాగరత్నమ్మ వేంపల్లె మానవతా సేవా సంస్థకు బాడీ ఫ్రీజర్ విరాళంగా అందజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నూతన బాడి ఫ్రీజర్‌ను మానవతా సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, దాత మేడ వెంకట వీర బ్రహ్మం ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపదలో ఉన్న వారికి సేవా చేయడానికి మానవతా సేవా సంస్థకు దాతలు సహకారం చేయడం సంతోషకరమని చెప్పారు. సమాజంలో కొన్ని ప్రాంతాల్లో దహన సంస్కరణలకు నిరాకరిస్తు అమానుష దురాచారం జరుగుతుందని చెప్పారు. వాటిని నిర్మూలి ంచేందుకు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ కట్టుబడి పనిచేస్తుందని చెప్పా రు. కార్యక్రమంలో మానవతా కో-ఛైర్మన్ కావాలి కృష్ణతేజ, కన్వీనర్ బొజ్జ రంగారెడ్డి, అధ్యక్షులు పోతిరెడ్డి శ్రావణ్ కుమార్, పోలూరు సుభాష్, డాక్టర్ యోగేశ్వర బాబు, డాక్టర్ అరుణ్, డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, కొప్పు ల గంగయ్య, పోతిరెడ్డి గోపి, చెంద్రాయుడు, మధు, చల్లా బాలాజీ, మాజీ గండి ఛైర్మన్ రాజన్న, ఇన్ఫో మేనేజర్ రామాంజనేయురెడ్డి పాల్గొన్నారు.

గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప :ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తుండగా మరోవైపు ఒబెరాయ్ సంస్థ ఆతిథ్య సేవల కోసం సిద్ధమవుతోందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో గండికోట పర్యాటక అభివృద్ధిలో భాగంగా సుప్రసిద్ధ ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించి ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ నహర్ జీ, సంబంధిత ప్రాజెక్టు అభివృద్ధి ఏజెన్సీలతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రాంతమైన గండికోట పర్యాటక కేంద్రానికి అతి చేరువలోనేజాతీయ రహదార్లు, రైలు మార్గం, విమానయాన రవాణా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇన్ని సదుపాయాలతో భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాసిస్తుందనడంలో అతిశయోక్తి లేదన్నారు. అనంతరం సంబందిత అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కలెక్టర్ తో పాటు ఒబెరాయ్ హోటల్ గ్రూప్స్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ నహర్ జి, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, జమ్మలమడుగు తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఎపిటిడిసి ఎస్.ఈ. ఈశ్వరయ్య, ఎస్టేట్ ఆఫీసర్ రాంప్రసాద్, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఇరిగేషన్ అధికారులు, కన్సల్టెంట్స్ శివ, సాజిద్, అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉచిత సంతాన సాఫల్య సలహా శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ సామా సుధ

ప్రజాశక్తి-కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న ఎన్‌జిఒ హోమ్‌లో ఈ నెల 2న ఉచిత సంతాన సాఫల్య సలహా చికిత్సా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ సామా సుధ తెలిపారు. శుక్రవారం కడపలోని తన క్లీనిక్‌లో మీడియాతో మాట్లాడారు. సామాజిక సేవా దృక్పథంతో ప్రతి నెలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన సంతాన సాఫల్య వైద్య సేవలను సామాన్యులకు సైతం చేరువ చేస్తున్నట్లు వివరించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాయచోటిలో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సంతాన లేమి దంపతులకు డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమన్నారు. మహిళలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్, పురుషులకు వీర్య కణాల పరీక్ష ఉచితంగా చేస్తామన్నారు. సంతాన లేమితో బాధపడుతున్న రాయచోటి పరిసర ప్రాంతాల దంపతులు ఈ సదవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేర్ల నమోదుకు సెల్ నంబర్ 6303993055 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి

ప్రజాశక్తి - కడప : ఎన్నికలప్పుడు మైనార్టీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేని పక్షంలో వైసిపి ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని వైసిపి మైనార్టీ నగర అధ్యక్షులు, కార్పొరేటర్ మహమ్మద్ షఫీ హెచ్చరించారు. శుక్రవారం మాజీ ఉపముఖ్యమంత్రి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీల పక్షపాతి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే ముస్లిములకు 80,000 ఇచ్చి ఆదుకున్న నాయకుడు అని కొనియాడారు. కడప హజ్ హౌస్‌కు నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం గెలిచి 8 నెలలు అవుతున్నా ఇమాములకు, మౌజులకు వేతనాలు చెల్లించలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సూపర్ సిక్స్ అని నమ్మించి ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు అన్నారు. వెంటనే మైనారిటీలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి లేదంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమానికి సిద్ధమవుతాం అని హెచ్చరించారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - చాపాడు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని రికార్డులను శుక్రవారం జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిప్యూటీ సిఇఒ మైథిలితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పి సిఇఒ మాట్లాడుతూ కార్యాలయంలో రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను నమోదు చేయాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని సిబ్బందికి తెలిపారు. సబ్సిడీ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. కొనసాగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీర కిషోర్, ఎంఇఒ రవి శంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ మహమ్మద్ గౌస్, పంచాయతీరాజ్ ఎఇ వర్మ, ఉపాధి ఎపిఒ జగదీశ్వర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అతిథి భోజనం

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని భవిత సెంటర్‌లో ఉన్న విభిన్న ప్రతిభావంతుల చిన్నారులకు అతిథి భోజనం ఏర్పాటు చేసినట్లు ఐఇఆర్‌టి యశోద తెలిపారు. శుక్రవారం డాక్టర్ తాజుద్దీన్ పుట్టినరోజు సందర్భంగా సతీమణి డాక్టర్ షాహీన్ అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఎటువంటి సహాయ సహకారాలకైనా తమ వంతు బాధ్యతగా చేయడానికి ముందుకు ఉంటామని తెలియజేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఐఇఆర్‌టి చిన్నారులను అమ్మగా లాలించి తమ బిడ్డలుగా చూసుకోవడం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అతిథి భోజనం ఏర్పాటు చేసిన వారిని శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్, కేర్ టేకర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : గత ఏడాది నవంబర్‌లో స్పందనలో ఇచ్చిన అర్జీకి మైదుకూరు తహశీల్దార్, బద్వేల్ ఆర్డిఒ ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక ఇచ్చారని వారిపై చర్యలు తీసుకోవాలని సంబటూరు ప్రసాదు అనే రైతు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా శుక్రవారం రైతు మాట్లాడుతూ నంద్యాలంపేట గ్రామ పరిధిలో 2010 నుంచి సర్వేనెంబర్ 989లో 1.60 ఎకరాలు సాగు చేస్తున్నామన్నారు. కొంతమంది అగ్రవర్ణాలకు చెందిన వారు పొలాన్ని కబ్జా చేశారన్నారు. దీనిపై గత ఏడాది నవంబర్ 4న కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశానన్నారు. అధికారులు మూడు నెలలుగా కాలయాపన చేసి 988 సర్వే నెంబర్ భూమి నివేదిక ఇచ్చారన్నారు. ఈ విషయంపై జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై ఎస్‌సి అట్రాసిటీ భూ కబ్జా కేసు నమోదు చేసి తగు న్యాయం చేయాలని కోరారు.

మీ కోసం సేవా సంస్థకు అవార్డు

ప్రజాశక్తి -ఖాజీపేట : మండల పరిధిలోని తిప్పనపల్లెకు చెందిన మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు లభించింది. శుక్రవారం కడప నగరంలోని బృందా స్ఫూర్తి వృద్ధాశ్రమం 10వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ సేవలందిస్తున్న ఎన్‌జిఒలకు సన్మానం నిర్వహించారు. మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పుల్లగూర విష్ణువర్ధన్‌కు జిల్లా యువజన సర్వీసుల శాఖ జిల్లా అధికారి సాయి గ్రేష్, జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, ఏటూరు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ సమాజ సేవలో ఎన్‌జిఒల పాత్ర ఎంతగానో ఉందన్నారు. వారి సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధారాణి మీకోసం సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం

ప్రజాశక్తి -ఖాజీపేట : స్థానిక మెయిన్ బజార్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మర్పణ దినం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు సుంకు సత్యనారాయణ సృష్టి తో పాటు టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. అనంతరం వాసవి మాత ఆత్మార్పణ హోమగుండం నిర్వహించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాసులు, డిస్ట్రిక్ క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ దినేష్ కుమార్, వాసవి క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ దిండుకుర్తి నాగభూషణం, జోనల్ చైర్ పర్సన్ సగళా మహేంద్ర బాబు, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ రొట్టెల వినోద్ కుమార్, వాసవి క్లబ్ సెక్రటరీ మిట్ట మహేశ్వర్ గుప్త, క్లబ్ ట్రెజరర్ మెంటా హరికిషన్, వనిత క్లబ్ అధ్యక్షురాలు మేడ రత్నాలు పాల్గొన్నారు.